## ప్రగతిని పరుగులు పెట్టిస్తాం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- మంచిర్యాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 14 : సంపదను సృష్టించి, దానిని పేదప్రజలకు పంచడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మంచిర్యాలలో రూ. 760 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం జడ్పీబాలుర పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రగతిని పరుగులు పెట్టిస్తామన్నారు. తన సొంత నియోజకవర్గమైన మధిర అంటే ఎంత ఇష్టమో మంచిర్యాల నియోజకవర్గం అంటే కూడా అంతే ఇష్టమని అన్నారు. సురక్షిత ప్రాంతంలో రూ. 300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మిస్తున్నామని, ముంపునకు గురవుతున్న రాళ్లవాగు తీర ప్రాంతాలను కాపాడేందుకు రూ. 260 కోట్లతో కరకట్టలు నిర్మిస్తున్నామన్నారు. గిరిజనుల అభివృద్ధికి రూ. 12500 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాకేంద్రంలో ఇండస్ట్రియల్ టౌన్ షిప్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. దాదాపు నెల రోజులుగా జైబాపు, జైభీం, జై సంవిధాన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని, బాపూజీ చెప్పిన అంశాలను ఇంటింటికీ తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో రాజీవ్ యువ వికాసం పథకానికి పదివేల మంది, ఇందిరమ్మ ఇండ్ల పథకానికి నాలుగు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన వారందరికీ పథకాలు అందించాలని కోరారు. ఈజీఎస్ కింద పనులు కల్పించాలని, భూములు ఉన్నాయన్న సాకుతో కొంతమందికి పని ఇవ్వడం లేదని ఆయన ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చాలని అనడంతో పాటు అంబేద్కర్‌పై అనుచితంగా మాట్లాడుతున్న బీజేపీ నాయకులకు అంబేద్కర్ విగ్రహాన్ని తాకే అర్హత లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు పాల్గొన్నారు.

## పేపర్ మిల్లు యాజమాన్యం శ్రమ దోపిడీ



మిల్లు గేటు వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 14: కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ మిల్లు యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడీ చేస్తోందని బీఆర్ఎస్ నాయకులు సీపీ రాజ్ కుమార్, మోయిన్, అంబాల ఓదెలు, కన్నయ్య, రాగులయ్య ఆరోపించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పేపర్ మిల్లు గేటు వద్ద సోమవారం కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. పేపర్ మిల్లు కార్మిక చట్టాలు అమలు కాకుండా యాజమాన్యం అడ్డుకుంటోందన్నారు. గతంలో కార్మికులు అనుభవించిన సౌకర్యాలు, హక్కులు అమలు చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు. కాగజ్‌నగర్ మండలంలోని కోసిని గ్రామంలోని ఆర్ఎస్పీ నివాసంలో నిర్వహించే కార్మికుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు.

## సింగరేణి ఆణిముత్యం క్రాంతి



మందమర్రిలో క్రాంతిని సన్మానిస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

మందమర్రి, ఏప్రిల్ 14 : సింగరేణి ఆణిముత్యం దుర్గం క్రాంతి అని, నిరుద్యోగ యువత ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. మందమర్రి ఏరియా కాసిపేట గనిలో ఉద్యోగం చేస్తూనే గ్రూప్–1 ఫలితాల్లో 552 ర్యాంక్ సాధించిన యాపల్ ఏరియాకు చెందిన దుర్గం సుజాత–రమేశ్ దంపతుల కొడుకు క్రాంతిని సోమవారం టీబీజీకేఎస్ కార్యాలయంలో సన్మానించారు.

బెల్లంపల్లి, ఏప్రిల్ 14 : ఇటీవల గ్రూప్–1లో ర్యాంక్ సాధించిన శాంతిఖని గని ఓవర్‌మన్ దుర్గం క్రాంతిని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్రాంతి కుమార్ తొమ్మిదేళ్లుగా గనిలో ఓవర్ మెన్‌గా విధులు నిర్వర్తిస్తూనే 452 మార్కులతో 552 ర్యాంక్ సాధించాడు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బడికల రమేశ్, అధ్యక్షుడు చీమల హరీశ్, ఉపాధ్యక్షుడు చిలుముల నర్సయ్య, జనరల్ సెక్రటరీ లింగాల కిరణ్, సోషల్ మీడియా ఆర్గనైజర్ మంతెన భాస్కర్, గని ఉద్యోగులు బసవరాజు, దుర్గం అశోక్, దుర్గం క్రాంతి, మంతెన రమేశ్, పొట్ట రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న మండలాభివృద్ధి కమిటీ కన్వీనర్ ఎస్ కొండయ్య

జన్నారం, ఏప్రిల్ 14 : టైగర్ జోన్ పేరుతో ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకోవద్దని జన్నారం మండలాభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాములు కొండయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో విద్య, వైద్యం, మంచినీరు అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలో 30 పడకల దవాఖాన, గురుకుల పాఠశాలను ఏర్పాటు చేసి, బీసీ, ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు విద్యనందించాలని పేర్కొన్నారు. కో కన్వీనర్లు కేప నర్సింహులు, కోడూరి చంద్రయ్య, రవి, మూల భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

## ట్రస్ట్ సేవలు అభినందనీయం

పెంచికల్ పేట్, ఏప్రిల్ 14 : నిషా జోహ్రీ, జగేంద్ర కుమార్ జోహ్రీ మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కస్తూర్బా విద్యాలయం ఎస్‌వో కవిత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయంలో ట్రస్టు నిర్వాహకులు అమిత్ జోహ్రీ తరపున ట్రస్ట్ సభ్యులు గడ్డం మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 5 సీలింగ్ ఫ్యాన్స్ అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, భుజంగరావు, తిరుమల గౌడ్, రేణుక, హరీశ్, లక్ష్మణ్ ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.



విద్యార్థులకు ఫ్యాన్లు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు మహేశ్ గౌడ్



సీసీసీ నస్పూర్ : నస్పూర్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మందమర్రి : బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల ర్యాలీ



పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో నృత్యం చేస్తున్న యువకులు

# ఘనంగా అంబేద్కర్ జయంతి

*మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు.., జిల్లా, మండల కేంద్రాల్లోని కూడళ్లు, గ్రామాల్లో చిత్రపటాలు, విగ్రహాలకు ఆయా పార్టీలు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.* - నమస్తే నెట్‌వర్క్, ఏప్రిల్ 14



బెల్లంపల్లి : కేక్ కట్ చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



మంచిర్యాల అర్బన్ : చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఆఫీస్‌లో జనరల్ మేనేజర్ శ్రీనివాస్, డీవైజీఎం అరవింద రావు, అధికారుల సంఘం కార్యదర్శి భీమన్న, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సీ లైజన్ ఆఫీసర్ కిరణ్‌కుమార్.., జన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు సిటిమల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రం రాజారాం రెడ్డి, సులువ జనార్దన్, ఫజల్‌ఖాన్.., హాజీపూర్ బస్టాండ్ వద్ద మాజీ వైస్ ఎంపీపీ మందపెల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు.., గుడిపేట 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ వెంకట్రాములు, అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్ రావు, అధికారులు.., బీఆర్ఎస్ పార్టీ నస్పూర్‌కాలనీ కార్యాలయం, గోదావరికాలనీ షిర్కె చౌరస్తాలో బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య.., సీసీసీ కార్నర్ వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, పవర్, వంగ తిరుపతి, నస్పూర్‌కాలనీ టీబీజీకేఎస్ కార్యాలయం వద్ద శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, సీసీసీ నందనవనం పార్క్ ఏరియా సింగాపూర్ పునరావాసకాలనీలో డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు అట్కాపురం సమ్మయ్య, అట్కాపురం మల్లేశ్.., వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలో మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కుబిడె వెంకటేశం, మాజీ సర్పంచ్ బాపు.., క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజా రమేశ్, పట్టణాధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకులు ఆసాల రాజన్న, ఆసాల రాజన్న, అశనవేని సత్యానారాయణ, అలుగుల సత్యనారాయణ, వారసంతలో ఎమ్మెల్యే వివేక్, మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గద్దె రాజు.., భీమారం మండలంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజ్‌కుమార్, సీనియర్ నాయకులు దాసరి మధునయ్య, బస్టాండ్ ప్రాంతంలో ఎమ్మెల్యే వివేక్.., బెల్లంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సభ్యుడు బడికెల రమేశ్, నాయకులు గద్దల ధర్మేంద్ర, మద్దెల గోపీ నివాళులర్పించారు. శాంతిఖని గని ఆవరణలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆవుల రవికిరణ్, ఎమ్మెల్యే గడ్డం వినోద్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బడికల రమేశ్, అధ్యక్షుడు చీమల హరీశ్, ఉపాధ్యక్షుడు చిలుముల నర్సయ్య, జనరల్ సెక్రటరీ లింగాల కిరణ్, సోషల్ మీడియా ఆర్గనైజర్ మంతెన భాస్కర్, గని ఉద్యోగులు బసవరాజు, దుర్గం అశోక్, దుర్గం క్రాంతి, మంతెన రమేశ్, పొట్ట రాజలింగు.., చెన్నూర్ పట్టణంలో ఎమ్మెల్యే వివేక్, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాజారమేశ్, కిష్టంపేటలో రాజా రమేశ్, మాజీ సర్పంచ్ బుర్ర రాకేశ్ గౌడ్.., లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తా వద్ద పెద్దపెల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, అంబేద్కర్ యువజన సంఘం పట్టణాధ్యక్షుడు రాజు.., నెన్నెల, గుండ్లసోమారం, కోణంపేట గ్రామాల్లో నాయకులు గట్టు మల్లేశ్, బానేశ్, మాజీ ఎంపీటీసీ హరీశ్‌గౌడ్.., కాసిపేట ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, మండల కేంద్రంలో అంబేద్కర్ సేన జిల్లా అధ్యక్షుడు నగురారపు సుమన్, సోమగూడెం(కే)లో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి నివాళులర్పించారు. మల్కెపల్లిలో అంబేద్కర్ సేన మండలాధ్యక్షుడు రత్నం ప్రదీప్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మందమర్రిలోని టీబీజీకేఎస్ కార్యాలయం నుంచి మార్కెట్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు నాయకులు ర్యాలీ తీశారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్, పాల్గొన్నారు. గ్రీన్‌పార్క్‌లో ఏరియా ఇన్‌చార్జి జీఎం విజయ ప్రసాద్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీఎంవోఏఐ అధ్యక్షుడు రమేశ్, ఏజీఎం ఈఅండ్ఎం వెంకటరమణ, డీవైపీఎం, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంప్లాయీస్ లైజనింగ్ ఆఫీసర్లు మైత్రేయ బంధు, బాబు, ఎండీ ముస్తఫా పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తుంగపిండి రాజలింగు, ఆర్ఐ కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు. మార్కెట్ సమీపంలో గల అంబేద్కర్ చౌక్‌లో ఎమ్మెల్యే వివేక్ పాల్గొన్నారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేట నుంచి మండల కేంద్రం వరకు అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు బాపు, మాల మహానాడు మండలాధ్యక్షులు దయాకర్, సంతపురి రవితేజ, యువకులు ర్యాలీ తీశారు. జైపూర్ తహసీల్ కార్యాలయ సమీపంలో ఎమ్మెల్యే వివేక్, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

### కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో..

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి..ఎస్పీ డీవీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అంబేద్కర్ సంఘం నాయకులు, యువజన సంఘం నాయకులతో కలిసి అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కెరమెరి తహసీల్ కార్యాలయంలో ఎంఆర్ఐ పవన్, కెరమెరి గ్రామ పంచాయతీలో సిబ్బంది, మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు.., కౌటాల మండల కేంద్రంలో నిజేత్వాన్ బుద్ధ విహార్ వద్ద ఎంఈవో గావు డే హన్మంతు..,చింతలమానేపల్లి తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంఈవో సోమయ్య.., తిర్యాణి మండల కేంద్రంలో ఎస్ఐ శ్రీకాంత్, మోకుదెబ్బ రాష్ట్ర నాయకుడు జవ్వాజీ అనీల్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం నాయకులు.., కాగజ్‌నగర్ పట్టణంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగుల సంఘం, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. బెజ్జూర్ మండల కేంద్రంతోపాటు మర్తిడి యువకులు, అలాగే పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులు, యువకులు ర్యాలీ తీశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ భక్తు రామచందర్, మాజీ ఎంపీటీసీ రాజన్న, మాజీ సర్పంచ్ చంద్రమౌళి నాయకులున్నారు. రెబ్బెన మండలంలోని గోలేటి జీఎం, తహసీల్ కార్యాలయాలు, గోలేటి, రెబ్బెన, గంగాపూర్, నంబాల గ్రామాలోల వేడుకలు నిర్వహించారు.





కంకర తేలి, గుంతలమయంగా తయారైన కాసిపేట బైపాస్ రోడ్డు

# ప్రయాణం.. నరకప్రాయం..

- కాసిపేట బైపాస్ రోడు అధ్వానం..
- ప్రమాదాలకు గురవుతున్న కార్మికులు, స్థానికులు
- పట్టించుకోని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం

*కాసిపేట మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఎక్కడికక్కడ కంకర తేలి, గుంతలు, పగుళ్లతో అధ్వానంగా తయారైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించాల్సిన దుస్థితి దాపురించింది. సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సింగరేణి కార్మికులు, స్థానికుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.* - కాసిపేట, ఏప్రిల్ 14

కాసిపేట మండల కేంద్రంలోని దేవాపూర్‌కు వెళ్లే దారిలో కాసిపేట ప్రభుత్వ పాఠశాల నుంచి ముత్యంపల్లి బస్టాండ్, కాసిపేట గని సమీపం వరకు ఉన్న బైపాస్ రోడ్డు కంకరతేలింది. పగుళ్లతో గుంతులమయంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణం నరకం కనిపిస్తున్నదని, వేరే దారి లేక రోజూ రాకపోకలు సాగిస్తున్నామని కార్మికులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానమై, పగుళ్లు తేలి ప్రమాదకర గుంతలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. ఈ రోడ్డు గుండా కాసిపేట 1 ఇంక్లైన్, 2 ఇంక్లైన్ గనుల కార్మికులతోపాటు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మికులు, మండలంలో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి డ్యూటీలకు వెళ్లే కార్మికులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సింగరేణి యాజమాన్యం రోడ్డును నిర్మించాలి. కానీ పట్టించుకోకపోవడంతో తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సింగరేణి అధికారులు తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి, చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయమని ప్రకటనలు చేసే సింగరేణి అధికారులు.. కార్మికులు ప్రమాదాలకు గురువుతున్నా పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని మండలవాసులు, కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధ్వానమైన రోడ్లతో అనారోగ్య పాలవడంతోపాటు వాహనాలు చెడిపోతున్నాయని, ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అద్దె భవనంలోనే తహసీల్ సేవలు

- శాశ్వత బిల్డింగ్ నిర్మాణం..
- బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి.. ప్రారంభించని ప్రస్తుత ప్రభుత్వం
- అద్దె చెల్లిస్తూ.. ప్రజాధనం దుర్వినియోగం



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన తహసీల్ కార్యాలయం

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 3 : బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పెంచికల్‌పేట్‌ను నూతన మండలంగా ప్రకటించారు. అప్పటి నుంచి ప్రజలకు మండల అధికారుల సేవలు అందుబాటులోకి వచ్చాయి. శాఖలవారీగా శాశ్వత భవనాలకు సైతం నిధులు మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేశారు. మండల కేంద్రం ప్రారంభంలోనే కేజీబీవీ పక్కన తహసీల్ కార్యాలయం పక్కా భవన నిర్మాణం పూర్తయింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఆ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకా అద్దె భవనంలోనే సేవలు కొనసాగుతున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా, తహసీల్ కార్యాలయ భవన నిర్మాణం పూర్తయిన విషయం వాస్తవమేనని తెలిపారు. కానీ, విద్యుత్, నీటి, టాయిలెట్ల సౌకర్యం లేదని పేర్కొనారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక పంపించినట్లు వెల్లడించారు. ఒకవైపు పూర్తయిన భవనం ప్రారంభించక నిరుపయోగంగా ఉండడం.., అద్దె భవనానికి అద్దె చెల్లిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## యువకుడి ఆత్మహత్య

భైంసాటౌన్, ఏప్రిల్ 14: కడుపునొప్పి భరించలేక యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన కల్యాణ్‌కర్ తానాజీ (31) కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. భరించలేక సోమవారం తన పొలంలో వేప చెట్టుకు నైలాన్ తాడుతో ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## మక్క పంట దగ్ధం

కుంటాల, ఏప్రిల్, 14 : మండలంలోని లింబా (కే)లో రైతు ముకుంద గంగాధర్ పటేల్ రెండున్నర ఎకరాల మక్క పంట సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. 100 క్వింటాళ్ల వరకు చేతికొచ్చే పంట అగ్నికి ఆహుతి అయిపోగా రెండు లక్షల మేర నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

## హోంగార్డ్‌కు సీపీ ఆత్మీయ వీడ్కోలు



హోంగార్డు దంపతులను సన్మానిస్తున్న రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 14 : పోలీస్ శాఖలో 41 ఏళ్లు హోంగార్డ్‌గాబెల్లంపల్లి సబ్ యూనిట్‌లో విధులు నిర్వహించి, విరమణ పొందుతున్న జీ రాజలింగును సోమవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ అంబర్ కిషోర్ ఝా ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక అందజేశారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఆర్ఐ హోంగార్డ్స్ వామన మూర్తి తదితరులు పాల్గొనారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

మంచిర్యాల అర్బన్, ఏప్రిల్ 14 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఏసీసీ ఏరియాలో గల డీ మార్ట్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్ బీ జోన్‌కు చెందిన లగిశెట్టి తిరుపతి–స్వప్న ఇద్దరి పిల్లలు అశ్వంత్, ఆధ్యతో బైక్‌పై మంచిర్యాలలో జరిగే శుభకార్యానికి వస్తున్నారు. డీ మార్ట్ వద్దకు రాగానే ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న సమయంలో బస్సు వారి బైకుకు తగిలింది. దీంతో పడిపోవడంతో పిల్లలకు గాయాలయ్యాయి. 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ విషయంపై పోలీసులను వివరాణ కోరగా, ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 14: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ రవీందర్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని చిర్రకుంట శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను సీఐ రవీందర్ పోలీస్ సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, విశ్వసనీయ సమాచారంతో రైడ్‌చేసి గ్రామ శివారులో నిల్వ ఉంచిన సుమారు వంద ట్రిప్పుల ఇసుక డంప్‌ను గుర్తించి, తహసీల్దార్ కార్యాలయానికి అప్పగించామని తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక్కడ పోలీస్, రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

## వేతనాలు పెంచాలని వినతి

మంచిర్యాల టౌన్, ఏప్రిల్ 14 : మున్సిపాలిటీల్లోని కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు మంచిర్యాల మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ వినతిపత్రం అందజేశారు. మంచిర్యాలలో సోమవారం అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు సమస్యలు విన్నవించారు. శానిటేషన్ విభాగంలో ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, చాలీచాలని జీతంతో కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 14: కాగజ్‌నగర్ పట్టణంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ కమలాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని గాంధీ పార్క్, మార్కెట్ ఏరియాలోని చెట్లకొమ్మల నరికివేత కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## మున్నూరు కాపులను తక్కువ చూపడం అన్యాయం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 14 : రాష్ట్ర ప్రభుత్వం చేసిన సర్వేలో మున్నూరుకాపులను తక్కువగా చూపడం అన్యాయమని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగం రాజారాం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మున్నూరు కాపు సంఘాల కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన దశాదిశా, గర్జన సన్నాహక సమావేశంలో తీర్మానాలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఆకుల సత్తయ్య, జోగుల శ్రీదేవి, బోరిగ వెంకటేశ్, అధికార ప్రతినిధి భాస్కర్ల రాజేశం పాల్గొన్నారు.

## కోదండ రామాలయానికి తాళం

కాసిపేట, ఏప్రిల్ 14 : నిత్యం పూజలు అందుకోవాల్సిన దేవుడి ఆలయానికి తాళం వేసిన సంఘటన కాసిపేట మండల కేంద్రంలోని కోదండ రామాలయం, శివాలయంలో చోటు చేసుకున్నది. భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఆలయ కమిటీ మాజీ సభ్యుడు, ఆలయ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించిన గొల్లపల్లి సత్యనారాయణ ఆదివారం ఆలయానికి తాళం వేశాడు. ఈ విషయమై గొల్లపల్లి సత్యనారాయణను వివరణ కోరగా, ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్న గొల్లపల్లి కమలాకర్‌కు జీతం రూ.10 వేలు వస్తున్నాయని, కానీ సరిగా పని చేయడం లేదని, ఇష్టం వచ్చినట్లు కల్యాణం చేయడం, ఆలయానికి వచ్చే వారికి గౌరవం ఇవ్వకపోవడం సరికాదని పేర్కొన్నాడు. కాగా, సత్యనారాయణ, అర్చకుడు కమలాకర్ అన్నదమ్ములు. భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు. అలాగే అర్చుకుడిని వివరణ కోరగా, కావాలనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపాడు. ఈ సంఘటనపై ఆలయ కమిటీ స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగించింది. విషయం తెలిసి ఆరోపణలు రావడంతో సోమవారం తాళాలు తీశారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ఖానాపూర్ టౌన్, ఏప్రిల్ 14 : దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన ఇద్దరిని ఖానాపూర్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖానాపూర్ సీఐ అజయ్ తెలిపిన వివరాల ప్రకారం, పెద్దపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు మిత్రులు మనుపటి రాజు, బొజ్జ రాజశేఖర్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడేవారన్నారు. నిందితులు తమ దొంగతనాల్లో భాగంగా ఇటీవల ఖానాపూర్ పట్టణంలోని కుమ్రం భీం చౌరస్తా వద్ద పోతులూరి అలయానికి బైక్‌పై వచ్చి బండరాయితో తాళం పగులగొట్టి వెండి, బంగారంతోపాటు నగదును అపహరించారు. అనంతరం తర్లపాడ్ గ్రామంలోని అగ్గి మల్లన్న అలయం తాళాలు పగలగొట్టి వెండి, బంగారం, నగదును ఎత్తుకెళ్లారన్నారు. చోరీలపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితులిద్దరిని అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 50 తులాల వెండి, 4గ్రాముల బంగారం, రూ.9 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఇది వరకే పలు పోలీస్‌స్టేషన్లలో దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. కేసును త్వరగా ఛేదించిన ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, సిబ్బందిని సీఐ అభినందించారు.